క్లుప్తంగా

మౌలిక సదుపాయాలు తప్పనిసరి

● ఎంఈఓ – 1 సామల సింహాచలం



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ-1 సామల

బలిజిపేట: కళాశాల విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పన ఎంతో అవసరమని ఎంఈఓ-1 సామల సింహాచలం తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించి.. వసతి సౌకర్యాలు, టాయిలెట్స్, బాత్‌రూములను పరిశీలించారు. ఆర్‌ఓ ప్లాంట్ పాడైన విషయం గుర్తించి, వెంటనే వాటికి మరమ్మతులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి' బిల్లుల చెల్లింపుల్లో లాలూచీ

● టెక్నికల్ సహాయకుడిపై ఫిర్యాదు



గ్రామసభలో పాల్గొన్న మాజీ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, గ్రామపెద్దలు

సీతానగరం: మండలంలో ఉపాధి హామీ పథకం బిల్లుల చెల్లింపుల్లో అవకతవకలు జరిగినట్లు తేట తెల్లమవుతోంది. మండలంలోని ఇప్పలవలసలో మాజీ సర్పంచ్ యు సత్యానారాయణ, ఎంపీటీసీ జి. సంతోషికుమారి, గ్రామపెద్దల సమక్షంలో డీఆర్పీ ఎం.నరేష్ బృందం సోమవారం సామాజిక తనిఖీపై గ్రామ సభ నిర్వహించింది. ఈ సందర్భంగా వేతనదారుల నుంచి వివరాలు సేకరిస్తుండగా.. అధిక బిల్లులు వేసేందుకు 209 మంది వేతనదారులు వారానికి వంద రూపాయలు చొప్పున చెల్లించినట్లు బయటపడింది. దీంతో అసలు సూత్రదారి టెక్నికల్ సహాయకుడిపై ఫిర్యాదు చేశారు.

అభినందనలు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బలిజిపేట: ఇస్రో ఆధ్వర్యంలో బొబ్బిలిలో ఇటీవల నిర్వహించిన పోటీలలో వంతరాం ఉన్నత పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిన్ని వెంకటరమణ, ఉపాధ్యాయులు సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ విభాగాలతో పాటు స్పేస్‌కు సంబంధించిన ప్రాజెక్ట్‌ల తయారీలో రాణించిన విద్యార్థులకు నిర్వాహకులు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇంద్రామణి, తదితరులున్నారు.

మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తే చర్యలు

సీతానగరం: మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవని ఎస్సై ఎం. రాజేష్ అన్నారు. సోమవారం స్థానిక హనుమాన్ జంక్షన్ వద్ద వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు.

113 మందికి ఉద్యోగాలు



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న కంపెనీ ప్రతినిధి

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 113 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసాచారి తెలిపారు. ఈ జాబ్‌మేళాకు 198 మంది హాజరుకాగా.. అదాని ఎనర్జీ సొల్యూషన్, పాటిల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్, తదితర కంపెనీలకు 113 మంది ఎంపికయ్యారన్నారు. ఈ మేరకు విద్యార్థులను ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, వివిధ కంపెనీల హెచ్‌ఆర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. ఇప్పటికే నాలుగు విడతల్లో సీట్ల భర్తీకి చర్యలు చేపట్టామని, ఇది ఐదో విడత అని పేర్కొన్నారు. సీట్లు కావాల్సిన వారు ఈ నెల 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకుని, సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకుని, ఇదే నెల 17వ తేదీన అడ్మిషన్ కోసం సీతంపేట ఐటీఐకు ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు.

ఒడిసెలమెట్టను ఒలిచేస్తున్నారు..

● అడ్డగోలుగా జేసీబీతో తవ్వకాలు
● పట్టించుకోని అధికారులు

మక్కువ:

మండలంలోని ఒడిసెలమెట్టను ఒలిచేస్తున్నారు.. ఎవరికి నచ్చినట్లు వారు అక్రమంగా కంకరను దోచేస్తున్నారు.. ఏకంగా జేసీబీలతో కంకర తవ్వకాలు జరపడంతో ఒడిసెలమెట్ట తన రూపు కోల్పోతోంది. నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో కంకర తరలిపోతోంది. కొత్తగా ఇళ్లు కట్టుకుంటున్నవారు, ఆయిల్‌పామ్ తోటలకు రహదారులు వేసుకుంటున్న వారు దర్జాగా అందరి కళ్లముందే కంకరను తీసుకెళ్తున్నా.. సంబంధిత అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలోని కాశీపట్నం పంచాయతీ పరిధిలో పాపయ్యవలస గ్రామ ఉంది. ఈ గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 67లో ఒడిసెలమెట్ట ఉంది. కొద్ది కాలంగా ఈ మెట్ట నుంచి కంకర తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఒకరిని చూసి మరొకరు అన్నట్లు వెంచర్ల కోసం, పొలాలు, తోటలకు రహదారులు ఏర్పాటుకు కంకర వినియోగిస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా యంత్రాల వినియోగంతో కంకర రవాణా జరుగుతున్నా రెవెన్యూ శాఖాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించకపోతే ఒడిసెల మెట్ట కనుమరుగయ్యే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.





ఆనవాలు కోల్పోయిన ఒడిసెలమెట్ట ఇదే (ఇన్‌సెట్లో)ట్రాక్టర్‌కు కంకర లోడు చేస్తున్న జేసీబీ

పరిశీలిస్తాం..

నేను ఇటీవలే బాధ్యతలు స్వీకరించాను. ఒడిసెలమెట్టను పరిశీలించి, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను. నిబంధనలకు విరుద్ధంగా కంకర ఎవ్వరు తరలించినా చర్యలు తప్పవు.

– చింతల నరేష్, వీఆర్‌ఓ, కాశీపట్నం

ఆధార్ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోండి

బలిజిపేట: పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ఆధార్ కేంద్ర సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని పార్వతీపురం డివిజనల్ పోస్టల్ సూపరింటిండెంట్ ఆర్. బాబూరావు తెలిపారు. తుమరాడ శ్రీభారతి పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో మొదటి రోజు 50 మంది విద్యార్థులకు ఆధార్ సేవలు అందించినట్లు చెప్పారు. 5 నుంచి 15 సంవత్సరాల్లోపు చిన్నారులే కాకుండా ఇతరులు కూడా వచ్చి అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు.



విద్యార్థినికి ఆధార్‌కార్డు సవరణలు చేసిన తర్వాత ధృవపత్రం అందిస్తున్న బాబూరావు

కార్యక్రమంలో బొబ్బిలి డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ గౌతమ్, సిబ్బంది పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ గ్రామాలపై చిన్నచూపు తగదు



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజన ఆదివాసీ జేఏసీ సంఘ నాయకులు

● ఏపీ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ

పార్వతీపురం రూరల్: రాజ్యాంగ బద్ధంగా తమ గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతాలుగా గుర్తించాలని, రహదారులు లేక ప్రాణాలు కోల్పోతున్న గిరిజనుల గోడును పట్టించుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ కె.ధర్మారావు మాట్లాడుతూ.. 1950 రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం విశాఖ ఏజెన్సీలోని విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల గిరిజన ప్రాంతాలన్నీ షెడ్యూల్డ్ ఏరియాలేనని.. కానీ ఐటీడీఏ అధికారులు కొన్ని గ్రామాలను మాత్రమే గుర్తించడం అన్యాయమన్నారు. వెంటనే అన్ని గ్రామాలను చేర్చి కొత్త నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కొండశిఖర గ్రామాలకు తక్షణమే రోడ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నిమ్మక జయరాజు, జేఏసీ గౌరవ అధ్యక్షుడు విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ ఎ. నీలకంఠం, ఉపాధ్యక్షుడు సీతారాం, అన్నారావు, గౌరమ్మ, చంద్రశేఖరరావు, పల్లా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై సీబీఐ దర్యాప్తు చేపట్టాల్సిందే..



ఎక్సైజ్ సీఐ దాసుకు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

● వైఎస్సార్‌సీపీ నాయకులు

సాలూరు:

కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న నకిలీ మద్యం విక్రయాలపై తక్షణమే సీబీఐచే దర్యాప్తు చేయించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. నకిలీ మద్యాన్ని నియంత్రించాలని.. లిక్కర్ మాఫియాను అరికట్టి, నిందితులను శిక్షించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు నియోజకవర్గ కేంద్రంలో సోమవారం ధర్నా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర సూచనలతో స్థానిక డిగ్రీ కళాశాల నుంచి ఎక్సైజ్ శాఖ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కల్తీ మద్యంతో ప్రాణాలు పోతున్నా పట్టించుకోని సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. కల్తీ మద్యం తాగి మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యాలయాలు, ఆలయాల సమీపంలో ఏర్పాటు చేసిన వైన్‌షాపులను రద్దు చేయాలన్నారు. అనంతరం ఎక్సైజ్ సీఐ దాసుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసనాయుడు, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పద్మావతి, మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, నాయకులు గిరి రఘు, తదితరులు పాల్గొన్నారు.



ఎక్సైజ్ కార్యాలయానికి ర్యాలీగా వస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఆర్టీసీ ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచాలి

● కలెక్టర్ ప్రభాకరరెడ్డి

పార్వతీపురం రూరల్:

జిల్లాలోని ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్‌ల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకరరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బస్సుల్లో దుర్వాసన రాకుండా చూడాలని.. దివ్యాంగులు, వృద్ధులు బస్సులు ఎక్కేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. అమృత్ పథకం కింద బస్టాండ్లలో మొక్కలు నాటి పచ్చదనం పెంచాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాల్లో యువతను భాగస్వామ్యులను చేయాలని పిలుపునిచ్చారు.

వీఆర్‌ఓపై చర్యలు తీసుకోండి..

సాలూరు: సర్వేలు చేసి తప్పుడు నివేదిక ఇచ్చిన మండలంలోని కరాసవలస వీఆర్‌ఓ, సర్వేయర్లపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కరాసవలస దళితులు సాగుచేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని అనేకసార్లు అధికారులను కోరామన్నారు. కలెక్టరేట్ గ్రీవెన్స్‌సెల్‌లో వినతి ఇచ్చినా.. వీఆర్‌ఓ, సర్వేయర్ కలెక్టర్‌కు తప్పుడు నివేదికలు ఇచ్చారన్నారు. ఉద్యోగులపై చర్యలు తీసుకోని ఎడల ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు గాసి సింహాచలం, కృష్ణ, అప్పారావు, బంగారయ్య, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు, తదితరులు

పీజీఆర్‌ఎస్‌కు వినతుల వెల్లువ



మినీ వర్కర్లకు ఉద్యోగోన్నతి కల్పించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

● వివిధ రకాల సమస్యలపై వినతులు అందించిన అర్జీదారులు

పార్వతీపురం రూరల్:

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అర్జీదారులు పోటెత్తారు. వ్యక్తిగత, సామాజిక సమస్యలపై పలువురు సంబంధిత అధికారులకు వినతులు అందజేశారు. పింఛన్లు మంజూరు చేయాలని.. మౌలిక వసతులు కల్పించాలని కొంతమంది అర్జీలు సమర్పించగా.. ఏళ్ల నాటి తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ మినీ వర్కర్లు డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర్‌రెడ్డి, తదితరులు వినతులు స్వీకరించారు.

పింఛన్ మంజూరు చేయరూ..

నరాల వ్యాధితో శరీరం చచ్చుబడి మూడేళ్లుగా మంచానికే పరిమితమైన వీరఘట్టం మేజర్‌పంచాయతీకి చెందిన బొమ్మాళి ఆశ కోరింది. భర్త భూషణ్ సహాయంతో కలెక్టరేట్‌కు వచ్చిన ఆమె అధికారులను కలిసి తన పరిస్థితి వివరించింది. కనీసం కాలు కదపలేని తనకు పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని కోరింది.

మొక్కజొన్న కొనుగోలు చేయండి

జిల్లాలో మొక్కజొన్న పంట కోతకు వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటాకు 2,400 రూపాయలకు కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం. కృష్ణమూర్తి కోరారు. ఈమేరకు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

ఉద్యోగోన్నతి కల్పించాలి..

మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తూ పదో తరగతి అర్హత ఉన్నవారిని మెయిన్ కేంద్రాలకు కార్యకర్తలుగా నియమించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు ఉమా మహేశ్వరి, అమరవేణి, జ్యోతిలక్ష్మి కోరారు. ఈమేరకు మినీ కేంద్రాల కార్యకర్తలతో కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు.

మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి

వీరఘట్టం మండల కేంద్రంలోని జనవీధి, రెల్లివీధి ప్రాంతాల్లో సామూహిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాని ఆయా కాలనీవాసులు కోరారు. గతంలో పలుమార్లు అధికారులను కోరినా ఫలితం లేకపోయిందని.. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు



కోటి సంతకాల సేకరణ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

● పేదలందరికీ మెరుగైన వైద్యం అందాలనే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ హయాంలో 17 వైద్య కళాశాలల ఏర్పాటు
● వాటిని ప్రైవేటీకరిస్తూ ఊరుకునేది లేదు
● కోటి సంతకాల సేకరణలో మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం:

ప్రతి పేద కుటుంబానికీ ఉచిత వైద్యం, మెరుగైన విద్య అందించడమే లక్ష్యంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 17 వైద్య కళాశాలలు ఏర్పాటు చేశారని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. అటువంటి ప్రైవేట్ కళాశాలలను కూటమి సర్కారు ప్రైవేటీకరణ చేయాలనుకోవడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం తీరును నిరసిస్తూ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చినబోగిలి, లచ్చయ్యపేట గ్రామాల్లో సోమవారం సాయంత్రం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య కళాశాలలు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచినప్పుడే ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలోనే ఐదు మెడికల్ కళాశాలల పూర్తయి ప్రస్తుతం తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వెనుక పెద్ద స్కామ్ ఉందని ఆరోపించారు. ఈ మేరకు కోటి మంది ప్రజల నుంచి సంతకాలు సేకరించి, వారి ఆకాంక్షను ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి. శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు ఎం. బాబ్జీ, పంచాయతీరాజ్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. రామకృష్ణ, సర్పంచ్‌లు కె. శ్రీనివాసరావు, బుడితి శ్రీనివాసరావు, బళ్ల జగన్నాథం, బి. తిరుపతిరావు, యాళ్ల వెంకటనాయుడు, ఎంపీటీసీ సభ్యులు వై. శ్రీనివాస్, గురాల బుజ్జి, ఎస్. తిరుపతి,చుక్క రాంబాబు, చుక్క వెంకటనాయుడు, ఉప సర్పంచ్ గంట రమేష్, నాయకులు డి. కిశోర్‌కుమార్, చప్ప సురేష్, తేలు శ్రీనివాస్, బి. ధనంజయ్, బక్కు సూర్యనారాయణ, వై. గోపాలనాయుడు, లచ్చయ్యపేట, చినబోగిలి గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతుంటే ప్రభుత్వానికి పట్టదా..



కలెక్టరేట్ వద్ద రిలేనిరాహార దీక్షలలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

● కలెక్టరేట్ వద్ద ప్రజా సంఘాల రిలే నిరాహార దీక్షలు

పార్వతీపురం రూరల్: జిల్లాలో గిరిజన విద్యార్థుల వరుస మరణాలను నిలువరించాలని, వారి ప్రాణాలకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ గిరిజన, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఇటీవల మృతి చెందిన కురుపాం గురుకుల పాఠశాల విద్యార్థినులు అంజలి, కల్పన కుటుంబాలకు తక్షణమే ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ వసతిగృహాలు, పాఠశాలల్లో కనీస వసతులు కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు, పౌష్టికాహారం అందించాలని.. వసతిగృహాల్లో ఏఎన్‌ఎంలను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పాలక రంజిత్‌కుమార్, బి. రవికుమార్, కె.సోమేష్, పి. సంఘం, ఆర్‌వీఎస్ కుమార్, వి.దాలినాయుడు, టి. జీవ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కుటుంబాలకు రూ.50 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలి

కురుపాం: గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతూ అనారోగ్యం బారిన పడి మృతి చెందిన విద్యార్థులు అంజలి, కల్పన కుటుంబాలకు ప్రభుత్వం రూ.50లక్షల నష్ట పరిహారం చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.అశోక్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అఖిల్, సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. సోమవారం ఈ సంఘాల ఆధ్వర్యంలో కురుపాం గురుకుల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా సంఘాల నేతృత్వంలో రావాడ జంక్షన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. దీనికి ప్రత్యక్ష సాక్ష్యమే గురుకుల పాఠశాల పరిస్థితి అన్నారు. మృతి చెందిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యానికి కారణమైన గిరిజన సంక్షేమాధికారులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. జిల్లాలో ఉన్న అన్ని గిరిజన సంక్షేమాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం హెచ్‌డీటీ సురేష్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.